

## వైద్య సేవల విస్తరణకు కృషి

**ప్రజాశక్తి-పాడేరు :** అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో షేరిన్ అల్లూరి ట్రైబల్ హెల్త్ కౌన్సిల్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివాసీ గ్రామాల్లో ప్రజా వైద్య సేవల విస్తరణకు కృషి చేస్తుందని ఆ సంస్థ చైర్మన్ మొస్య ప్రసన్న కుమారి తెలిపారు. సంస్థ ప్రతినిధులతో శనివారం డిఎం హెచ్‌వో కృష్ణమూర్తి నాయక్ ను మర్యాద పూర్వకంగా కలిసి తమ సంస్థ ద్వారా అందిస్తున్న వైద్య ఆరోగ్య కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా డిఎం హెచ్వో సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతూ డోలి మోతల నివారణ, ఇతర వైద్య సేవల మెరుగునకు కృషి చేస్తామన్నారు. మాతా శిశు సేవలు, గిరిజన ప్రాంతంలో ప్రభలే వ్యాధులు-తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



డిఎంహెచ్ఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న ప్రతినిధులు

### బిర్సా ముండా స్ఫూర్తితో...

# హైడ్రో ప్రాజెక్ట్‌లపై ఉధృత పోరాటం

**-సరిహద్దు సమస్యపై ఒడిశా సిఎం ప్రకటన చేయాలి - సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం**

**ప్రజాశక్తి-పాడేరు :** ఆదివాసి హక్కుల కోసం ఉద్యమించిన పోరాట యోధుడు బిర్సా ముండా స్ఫూర్తితో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం తెలిపారు. ఆదివాసి పోరాట యోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జయంతి కార్యక్రమం నిర్వహించారు. పాడేరు ఏపీఎన్జిఓ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా బిర్సా ముండా చిత్రపటానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కే.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిలో సురేంద్ర, జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో పాల్గొన్న ప్రజలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. పాడేరు మండల కార్యదర్శి సోమేల చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, ఆదివాసి మహిళలను గతంలో కించపరిచిన ఒడిస్సా ముఖ్యమంత్రికి బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు లేదని విమర్శించారు. విశాఖపట్నం సరిహద్దు ప్రాంతాలలో కొనసాగుతున్న ఆంధ్ర-ఒడిస్సా సరిహద్దు వివాదాన్ని పరిష్కరించాలని, ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన ఒడిస్సా ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గిరిజన మంత్రి సంధ్యారాణి నియోజకవర్గంలోని కొటియా గ్రామాల్లో సమస్యలు తీవ్రమవుతున్నాయని, ఇది అంతర్రాష్ట్ర ఘర్షణకు దారితీస్తుందని తెలిపారు. రాష్ట్ర గిరిజన మంత్రి కూడా సరిహద్దు సమస్య పరిష్కారానికి ఒత్తిడి తెచ్చి చర్యలు తీసుకోవాలని పార్టీ డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో అన్యాయాలకు వ్యతిరేకంగా ముందుండి పోరాడే పార్టీ సిపిఎం మాత్రమేనని చెప్పారు. బిజెపి ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలతో అడవి, భూముల నుండి ఆదివాసులను దూరం చేయాలని ప్రయత్నిస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం గిరిజన భూములు, అడవులను పెట్టుబడి కంపెనీలకు అప్పగిస్తుందని, ఇప్పటికే 10 లక్షల ఎకరాలు ఇచ్చారని దుయ్యబట్టారు. పేసా చట్టం, గ్రామ సభ తీర్మానం లేకుండా హైడ్రో ప్రాజెక్టులు నిర్మించడం రాజ్యాంగ విరుద్ధమని, భవిష్యత్తులో ఆదివాసి ప్రాంతాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. 1/70 చట్టానికి వ్యతిరేకంగా ప్రైవేట్ వ్యక్తులు గెస్ట్ హౌస్‌లు, లాడ్జీలు నిర్మిస్తున్నారని విమర్శించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకోవడమే బిర్సా ముండాకు నిజమైన నివాళి అని అన్నారు. అరకు ఆర్గానిక్ కాఫీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం సరికాదని, గిరిజనులకు పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.



బిర్సా ముండా జయంతి సభలో మాట్లాడుతున్న లోకనాథం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, పోరాటంతోనే ఆదివాసి హక్కులు, చట్టాలు కాపాడుకోగలమని తెలిపారు. గతంలో బాక్సైట్, చైనాక్లే వ్యతిరేకంగా పోరాటం చేసి జీఓలు రద్దు చేయించిన ఘనత ఆదివాసులదని పేర్కొన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అటువంటి పోరాటాలు నిర్వహిస్తే అడ్డుకోగలమని, భవిష్యత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసులను ఐక్యం చేసి పోరాటం ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. గత నెలలో సిపిఎం బృందం గవర్నర్‌ను కలిసి హైడ్రో ప్రాజెక్ట్ ఒప్పందాలు రద్దు చేయాలని కోరినట్టు చేసినట్లు తెలిపారు.


సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పలనరస మాట్లాడుతూ, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసి ప్రాంతంలో వయుగ నవయుగ, అదాని కంపెనీలతో చేసుకున్న జిఓ 2, 13, 51లను రద్దు చేయాలన్నారు. బిజెపి ఎన్నికలను దృష్టితో బిర్సా ముండా జయంతి జరుపుతుందని విమర్శించారు. అటవీ ప్రాంతాల్లో సహజ వనరులను దోచుకోవడానికి జయంతి పేరుతో వార్షికోత్సవాలు నిర్వహిస్తూ ఆదివాసులకు భ్రమలు కలిగిస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, అనంతగిరి జెడ్పిటిసి దీసరి గంగరాజు, ఎస్బి పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు వివి జయ, చిట్టిబాబు, రామారావు, సుందరరావు, జయ, కాంతమ్మ, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పొద్దు బాలదేవ్, ఎస్ ధర్మాన పడల్ తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన గిరిజనులు

# మన్యంలో చలి పంజా

**- కమ్మేస్తున్న పొగ మంచు**
**- పడిపోతున్న ఉష్ణోగ్రతలు**
**-వణుకుతున్న మన్యం వాసులు**



జి.మాడుగులలో కమ్మేసిన మంచు



పాడేరులో మంట కాగుతున్న గిరిజనులు

**ప్రజాశక్తి-పాడేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి పంజా విసురుతోంది. ఏజెన్సీ అంతటా గత మూడు రోజులుగా చలి తీవ్రత అమాంతంగా పెరిగింది. మొంథా తుఫాన్ ప్రభావంతో ఈ ఏడాది ఏజెన్సీలో చలి ప్రభావం ఆలస్యంగానే మొదలైంది. ఇప్పుడు చలి ఒక్కసారిగా విజృంభిస్తోంది.. గత నాలుగు రోజులుగా చలి తీవ్రత అధికమైంది. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు తగ్గి పోతున్నాయి. పది డిగ్రీలకు ఉష్ణోగ్రత పడి పోయింది. శనివారం మినుములూరులో 9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు కాఫీ బోర్డ్ సీనియర్ లైజన్ అధికారి (ఎస్ఎల్ఓ), రమేష్ ప్రజాశక్తి కి తెలిపారు.

మన్యమంతటా దట్టంగా పొగ మంచు కమ్మేస్తోంది. రాత్రి పగలు దట్టంగా కురుస్తున్న మంచుతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు.పొగ మంచు ముసుగులో మన్యం పూర్తిగా ఒదిగిపోయింది. రోజులో 15 గంటలకు పైగా ఎక్కువ సమయం మంచు దట్టంగా కురుస్తోంది. పగటిపూట ఉదయం 11 గంటలకు భానుడు ప్రకాశించే వరకు చలి దంచేస్తోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి మొదలై రాత్రి వేళల్లో తీవ్రంగా పెరుగుతోంది.

మన్యంలో ఇక పౌర జీవన ప్రయాణం మంచు లోనే మొదలవుతోంది. ఈ సీజన్ లోనే సుమారు నెలరోజుల పాటు గిరిజన రైతులు ముమ్మరంగా వరి కోతల పనులు నిర్వహిస్తుంటారు. .వేకువ జాము నుంచి ఉదయం వేళల్లో వరి కోత పనుల్లో నిమగ్నం అయ్యే గిరిజన రైతు కుటుంబాలు వణికించే చలిలోనే తమ పొలాల వద్ద నెగళ్ళు వేసుకుని చలి నుంచి కాస్త ఉపశమనం పొందుతూ వరి కోత పనులు పూర్తి చేసుకుంటున్నారు. చలి నుంచి రక్షణ పొందుతూ చలిని తట్టుకొని మన్యవాసులు తమ జీవనాన్ని సాగించడానికి మూడు నెలల పాటు ఈ “చలిపులి”తో పోరాటం సాగిస్తుంటారు. వేడి వేడి ఆహారంతో పాటు రగ్గులు, స్వెటర్లు, చలిమంటలు వేసుకొని మన్యవాసులు చలి బారిన పడకుండా తమను తాము కాపాడుకుంటారు.

మన్యం పర్యాటకానికి వచ్చే మైదాన ప్రాంత వాసులకు మాత్రం ఈ చలిని తట్టుకోవడం చాలా కష్టమే.

కానీ మన్యంలో పర్యాటకుల కోసం రిసార్ట్స్ మంచి హెూటల్స్ ఏర్పాటు కావడంతో ఇప్పుడు ఈ చలిని ఆస్వాదించేందుకు పర్యాటకులు ఎక్కడకు ఎక్కువగానే తరలిస్తున్నారు. వీరి కోసం రిసార్ట్స్ నిర్వాహకులు ఫైర్ క్యాంపులో ఏర్పాటు చేస్తూ పర్యాటకులను ఆకట్టు కుంటున్నారు. వణికించే చలిలో కూడా పర్యాటకానికి కొంత క్రేజ్ ఏర్పడింది. ఇంకా మరో రెండు నెలలు పాటు మన్యం మంచు ముద్దగా ఆవిష్కరించనుంది.

**దిగజారిన ఉష్ణోగ్రతలు..**

అల్లూరి మన్యంలో గత నాలుగు రోజుల నుంచి 10 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు దిగజారాయి. గత రెండు రోజుల్లో ఏడు నుంచి తొమ్మిది డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదయ్యాయి..

**జిమాడుగుల:** గత మూడు రోజుల నుండి చలిపులి ఏజెన్సీని వణికిస్తుంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోయాయి. జి.మాడుగులలో శనివారం 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఉదయం 10 గంటలు కావస్తున్నా జన సంచారం లేదు. ఒక్కసారిగా చలి తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

# రైతులకు పవర్ టిల్లర్ యంత్రాలు పంపిణీ

**ప్రజాశక్తి- హుకుంపేట:** మండలంలోని గన్నేరు పుట్టు పంచాయతీలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పవర్ టిల్లర్లను రైతులకు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్‌కుమార్, స్థానిక సర్పంచ్ కృష్ణారావు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సంస్థ ప్రతినిధులతో కలిసి అర్హులైన రైతులకు పవర్ టిల్లర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏకలవ్య ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. ఉమా వెంకటేష్ మాట్లాడుతూ, చీకుమద్దుల, గన్నేరు పుట్టు పంచాయతీల పరిధిలోని 16 గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకం కింద సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా 16 మంది రైతులకు ఒక్కోటి రూ.1,06,000 విలువ చేసే పవర్ టిల్లర్లు అందజేస్తున్నామని వివరించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, సమిష్టిగా పనిచేస్తూ రైతుల స్వయం సమృద్ధి దిశగా ఏకలవ్య సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ కె. నారాయణరావు, చీకుమద్దుల సర్పంచ్ సూకూరు బొంజన్నదొర, వ్యవసాయ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

# ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-రంపచోడవరం :** ఎపి శాసనమండలి మాజీ సభ్యులు, జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు కె.ఎస్.లక్ష్మణరావు, ఎపి జనవిజ్ఞానవేదిక ప్రధాన కార్యదర్శి టి.సురేష్, యుటిఎఫ్ సౌజన్యంతో ముదించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్ ( ఎన్ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శనివారం ఆవిష్కరించారు. ఈ స్టడీ మెటీరియల్ స్కాలర్‌షిప్ ఎంపిక కావడానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు గడిపే విశ్వరాజ్ మాట్లాడుతూ 8 వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు ( ఎస్‌సి/యస్‌టి అభ్యర్థులకు 50 శాతం ) ఉండాలని ఈ స్టడీ మెటీరియల్ పేద విద్యార్థులకు ఎంతో బాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎపి యుటిఎఫ్ నుండి వై. విల్సన్‌బాబు, చుక్కా సనాతనబాబు, దూడ అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**మెంటల్ ఎబిలిటీ టెస్ట్ మెటీరియల్ ఆవిష్కరణ**

**రాజవొమ్మంగి :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎపి జన విజ్ఞానవేదిక వారు సప్లై చేసిన (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ ) విద్యార్థులకు మెంటల్ ఎబిలిటీ టెస్ట్ మెటీరియల్ పుస్తకాలను హెచ్ఎం ఆరు మిల్లి ఆదిలక్ష్మి అందించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మరిచెర్ల శ్రీనివాసరావు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు టి. బొజ్జియ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మైలబోయిన రాంబాబు, గొలగాని శ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.అలాగే మండలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడ్డంగి, లాగరాయి పాఠశాలల విద్యార్థులకు కూడా ఇవ్వడం జరిగింది.



మెంటల్ ఎబిలిటీ టెస్ట్ మెటీరియల్ తీసుకున్న విద్యార్థులు

# ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పరామర్శ

**ప్రజాశక్తి - జీకే వీధి:** మండలంలోని జర్రెల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఫుడ్ పాయిజన్ వలన అవస్థకు గురైన స్కూల్ పిల్లలను పరామర్శించిన అల్లూరి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు మాజీ ఎంపిపి వంతల బాబూరావు పాఠశాలలో వార్డెన్,ఉపాధ్యాయుల బందాన్ని కలసి పిల్లలకి ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది అని ఆర తీయగా పిల్లలందరూ కోలుకున్నారని ప్రస్తుతం పరవాలేదని చెప్పారు. జర్రేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మజీద్ అందిస్తున్న సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మొట్టడం బాలరాజు , పాంగీ శ్రీనుబాబు, గెమ్మెలి సింహాద్రి,వంతల రవి, వంతల శ్రీను,జీకే వీధి మండల ఉపాధ్యక్షులు మర్రి సూర్యనారాయణ, కొర్ర జగన్, పాంగి కష్ణ,తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుబ్బారావు

# ఏకలవ్య పాఠశాల నూతన భవనం ప్రారంభం

**ప్రజాశక్తి - కొయ్యూరు:** మండలంలోని బాలారం గ్రామంలో నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూలు భవనాన్ని భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. మాజీ జిసిసి చైర్మన్ ఎం.వి.వి.ఎస్ ప్రసాద్, కొయ్యూరు మండల ఎంపిపి బడుగు రమేష్, కొయ్యూరు తహశీల్దార్, జిఎస్‌వి ప్రసాద్, అప్పలనరసతో కలిపి ప్రారంభించారు. జిసిసి మాజీ చైర్మన్ ఎంవివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం, శుభ పరిణామం అన్నారు. అనంతరం ఎంపిపి బడుగు రమేష్ , మాజీ జడ్పిటిసి గాడి శ్రీరామమూర్తి, ఎంపిడిఒ ప్రసాదరావు, కొయ్యూరు ఎంఇఒ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**రంపచోడవరం:** మండలంలోని పెద్దగెద్దాడ గ్రామంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పిఎం మోడీ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 40 పాఠశాలలను శనివారం ప్రారంభించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈఎంఆర్ఎఫ్-కొయ్యూరు ఈఎంఆర్ఎఫ్ రంపచోడవరం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రంపచోడవరం డి ఎన్ వి రమణ, జడ్పిటిసి పండా వెంకటలక్ష్మి, ఎంపిపి బంధం శ్రీదేవి, సర్పంచ్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.



కొయ్యూరులో భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ జిసిసి చైర్మన్ ప్రసాద్, ఎంపిపి రమేష్

# జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు గిరిజన బాలిక



సురేఖను సన్మానిస్తున్న హెచ్ఎం సునీత, పాఠశాల సిబ్బంది

**ప్రజాశక్తి-వి.ఆర్‌పురం:** మండలంలో రామవరం పంచాయతీ సోములగూడెంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మడకం సురేఖ జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు మడకం భద్రమ్మ పూరి శివకుమార్ తెలిపారు. ఈ నెల 4,5,6 తేదీల్లో విజయవాడలోని నున్న హైస్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-14 33 కేజీల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి స్వర్ణం సాధించిందన్నారు. జనవరి మొదటి వారంలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన సురేఖను పాఠశాల హెచ్ఎం సునీత, పాఠశాల సిబ్బంది సన్మానించారు. రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో ఆరోతరగతి విద్యార్థిని ముచ్చిక హరిణి ద్వితీయ స్థానంలో ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో ఏడో తరగతి విద్యార్థిని వంజం అమూల్య తృతీయ స్థానంలో ప్రతిభ కనబరిచిందన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**గ్రామగ్రామాన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం**



సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర



డుంబ్రిగుడ: మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

**ప్రజాశక్తి -సీలేరు:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ దుర్జో సూచించారు. జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత ఆవాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ దుర్జో, కార్యదర్శి పరశురాం హాజరయ్యారు. విద్యార్థులుతో మాట్లాడుతూ చేతులు పరిశుభ్రం చేసుకోకుండా ఆహారము తింటే చేతి గోళ్లలో ఉన్న బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించి రోగాలు బారినపడే ప్రమాదం ఉందని పేర్కొ న్నారు.కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా ప్రకాష్, పాఠశాల హెచ్ఎం నాగభూషణం ఉపాధ్యాయులు పీసా కమిటీ ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

**జీకే వీధి:** మండలంలోనీ మొండిగడ్డ పంచాయతీ కేంద్రంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మాతే కామరాజు, పంచాయతీ సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ర్యాలీ నిర్వహించడం జరిగింది. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మొండిగడ్డ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు మాతే కామరాజు, సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** మండల కేంద్రంలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ర్యాలీని శనివారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి పెట్రోల్ బంక్ జంక్షన్ మీదుగా మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం ఎంపీడీవో ప్రేమాసాగర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉండవచ్చుని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎస్ సుందర్రావు, ఎంఈఓ2 గెన్ను, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - గంగవరం:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని గంగవరం ఎస్ఐ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ గంగవరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రంపచోడవరం కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు. నిందితులకు మొదటి తప్పుగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించడం జరిగిందన్నారు. ఇదే నిందితులు తిరిగి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికినట్లైతే జైలుశిక్ష జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

## ఒడిశా సిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**ప్రజాశక్తి -పాడేరు :** ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఈనెల 16న ఆదివారం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారని, ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ తెలిపారు. బిర్సా ముండా విగ్రహావిష్కరణ, బహిరంగ సభ ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా తదితర ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఒడిశా నుంచి ఉదయం12 గంటల ప్రాంతంలో లగిస పల్లికి చేరుకోనున్నారన్నారు.మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో చింతలవీధిలో బిర్సా ముండా విగ్రహ ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారని, అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు.అక్కడ నుంచి ఒడిశాకు బయల్దేరనున్నారన్నారు.

## చెక్ డ్యామ్ నిర్మాణానికి స్థల పరిశీలన

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** మండలంలోని సొవ్వ పంచాయితీ దేముడువలస, పనసవలస, కొత్రగొంది, మాలివలసతో పాటు తదితర గ్రామాలకు చెక్ డ్యామ్ నిర్మాణంకు అధికారులు స్థల పరిశీలన చేసినట్లు వైసిపి నాయకులు పి అశోక్, మాజీ సర్పంచ్ పి.రాంప్రసాద్ తెలిపారు. కొండ ఊట గెడ్డ నుంచి నీరు నేరుగా కాలువల్లోకి వెళ్లిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు, కూరగాయలు పండించే రైతులకు నీరు అందడం లేదన్నారు. చెక్ డ్యాంలు నిర్మిస్తే పంటలు పండుతాయన్నారు. సొవ్వ పంచాయితీ పరిధిలోని పలు గ్రామాలలో చెక్ డ్యాంల నిర్మాణం చేయాలని పాడేరు స్పందనలో కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన అధికారులు దేముడువలస, పనసవలస, కొత్రగొంది, మాలివలస గ్రామాల్లో స్థలాలు పరిశీలించి ఎస్టిమేషన్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వి గురునాయుడు, పీసా అధ్యక్షుడు గెమ్మెలి లోకినాథ్ ప్రసాద్, నాయకులు పొట్టంగి త్రినాథ్, పాంగి తిరుపతి, సొమెలి రాంనాథ్ పాల్గొన్నారు.

## గ్రంథాలయాల్లో పుస్తకాల ప్రదర్శన


హుకుంపేట గ్రంథాలయంలో విద్యార్థులు

**ప్రజాశక్తి- డుంబ్రిగుడ:** స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కథల పుస్తకాలు, వివిధ రకాల ఉద్యోగాల కాంపిటేటివ్ పుస్తకాలను ప్రదర్శన చేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులు కమలాకర్ మాట్లాడుతూ, ఇంటర్ తరువాత ఉన్నత చదువుల కోసం గ్రంథాలయాల్లో ప్రిపేర్ అవ్వడానికి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు, గ్రంథాలయ అధికారిణి ఎస్.సునీత, సుబ్బారావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**హుకుంపేట:**స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శనను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎం.సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, పుస్తకాలు మనిషికి జ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని, ఆలోచనా శక్తిని పెంచుతాయన్నారు.

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి-సీతమ్మధార :** జివిఎంసి 51వార్డు పరిధి మహత్ కాలనీలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఎస్సి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, విగ్రహ దాత ఎద్దు పైడిరాజు, అంబటి శైలేష్, ఎం.సునీల్, బోణి శివరామకృష్ణ, మంచ నాగమల్లీశ్వరి, తిరుమలరావు, రత్నం, ధర్మవతి, అప్పారావు మాస్టర్, శ్రీను, జెవి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన జర్నలిజం అవసరం

**ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్**



విలేకర్ల పునర్చరణ తరగతుల్లో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

**ప్రజాశక్తి-చింతపల్లి :** నేటి సమాజానికి విలువలతో కూడిన జర్నలిజం అత్యవసరమని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పేర్కొన్నారు. సిఆర్ మీడియా (ప్రెస్ అకాడమీ) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఏపీయూడబ్ల్యూజే చింతపల్లి ప్రెస్‌క్లబ్ సారథ్యంలో, జిల్లాలోని గ్రామీణ ప్రాంత విలేకరుల కోసం ఏర్పాటు చేసిన రెండు రోజుల పునశ్చరణ తరగుతలను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేకరులు ఎల్లప్పుడూ నిత్యాభ్యాసకులుగా, విషయపరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమాజానికి నిజాయితీతో కూడిన సమాచారం అందించడంలో జర్నలిస్టులు కీలక భూమిక వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం లీడర్ పత్రిక సంపాదకులు వివి రమణమూర్తి పరిశోధనాత్మక జర్నలిజం విధి విధానాలు, వార్తల సేకరణలో పాటించాల్సిన పద్ధతులపై విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. ఆంధ్రా యూనివర్సిటీ జర్నలిజం విభాగం మాజీ హెడ్ బాబీవర్ధన్ క్రైమ్ వార్తల పరిధి, వాటి రచనలో అనుసరించాల్సిన మెళకువలను వివరించారు. ఐజేయూ సెక్రటరీ జనరల్, సీనియర్ పాత్రికేయులు డి.సోమసుందర్ జర్నలిజంలో నైతిక విలువలు, జర్నలిస్టులు అవలంబించాల్సిన విధి విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘాల నాయకులు డి.సతీష్, డి.పద్మరాజు, వనరాజు, కెపి.రాజు, సిహెచ్చిఎల్ స్వామి, నాగరాజు, చింతల కిషోర్, రాజేష్, రామచంద్రరావు, జోగినాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఒడిశా సిఎమ్‌ను ఆదివాసీ మహిళలు నిలదీయాలి

**ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర**

**ప్రజాశక్తి -పాడేరు:** ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 16న పాడేరులో బిర్సా ముండా జయంతి కార్యక్రమంలో పాల్గొనే అర్హత లేదని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర తెలిపారు. గిరిజన మహిళలను కించపరిచిన ఒడిశా ముఖ్యమంత్రి పాడేరు ఏజెన్సీలో పర్యటించే అర్హత లేదన్నారు.డుంబ్రిగూడ మండలం కొల్లాపూట్ సరిహద్దు, సాలూరు మండలంలో కొటియా గ్రామాల సరిహద్దు ప్రాంతంలో ఆంధ్రా ఒడిశా సరిహద్దు సమస్యలు తక్షణమే పరిష్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు. బిర్సా ముండా ఆశయాలకు వ్యతిరేకంగా 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసుల హక్కులకు వ్యతిరేకంగా అడవిని హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి బీజేపీ, టిడిపిలు అదాని, నవయుగ కంపెనీలకు అప్పగిస్తున్నాయన్నారు. బిర్సా ముండా పోరాడిన విధంగా జల్ జమీన్ జంగిల్ అధికారం కోసం ఆదివాసుల పక్షాన నిలబడాలని పిలుపిచ్చారు. ఒరిస్సా ముఖ్యమంత్రి ఆదివాసీ అయి ఉండి ఆదివాసీ మహిళలను కించ పరచిన వ్యక్తి పాడేరు గిరిజన ప్రాంతాల్లో పర్యటించే అర్హత లేదని, ఇలాంటి వ్యక్తిని ఆదివాసీ మహిళలు నిలదీయాలని పిలుపుచ్చారు.

# టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ శివ కుమార్

**ప్రజాశక్తి- అనంతగిరి:**గిరిజన ప్రాంతం విద్యాభివృద్ధికి దోహదపడేందుకు అంకితభావంతో పని చేయాలని అల్లూరి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ శివ కుమార్ సూచించారు. మండలంలోని శనివారం ప్రభుత్వ ఆశ్రమ బాలుర పాఠశాల శివలింగపురం, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి తనిఖీ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు అందుతున్న విద్యా తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణ, గుణాత్మకంతో కూడిన విద్యా బోధన అందించాలని, అప్పుడే మెరుగైన ఫలితాలు సాధించ వచ్చునన్నారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలన్నారు.పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 బీబీ. నాగేశ్వరరావు, ఎమ్మార్సీ సిబ్బంది అచ్చిబాబు, కేజీబీవీ ఎస్ఓ సుశీల సిబ్బంది పాల్గొన్నారు

## నేరాలు ఘోరాలు

### గెడ్డలో మృతదేహం లభ్యం

**ప్రజాశక్తి- హుకుంపేట:**కోట్నపల్లి పంచాయతీ కొట్నపల్లి-పెద్దగరువు గ్రామాల మధ్య గుండా ప్రవహిస్తున్న గెడ్డలో శనివారం గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గెడ్డలోని కొమ్మలకు చిక్కుకుని ఆ మృతదేహం ఉంది. పోలీసుల విచారణతో మృతదేహంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.


స్టోర్ రూమ్‌ను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

## గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీలు

**ప్రజాశక్తి- కాశీపట్నం:** అనంతగిరి మండలంలో గుమ్మకోట గురుకుల పాఠశాలను ఆకస్మికంగా వైసీపీ నేతలతో కలిసి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడుతూ, వసతులు అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా? మెను ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. వంటశాల, స్టోర్ రూమ్లో సామగ్రిని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలం ఎంపీపీ శెట్టి నీలవేణి, వైసీపీ అనంతగిరి మండల పార్టీ అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ, అనంతగిరి మండలం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు పాగి అప్పారావు, మాజీ అనంతగిరి మండలం జడ్పీటీసీ దూరు గంగన్న దొర, వాలసి గ్రామ పంచాయతీ సర్పంచ్ సన్యాసిరావు, భీంపోల్ గ్రామ పంచాయతీ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు తవిటి నాయుడు, వైసీపీ నేతలు సుందర్‌రావు, కన్న బాబు, జన్ని చిన్నయ్య, పెంటయ్య, మహేష్ పాల్గొన్నారు.

## క్వారీలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్

**ప్రజాశక్తి-జి.మాడుగుల :**మండలంలో సింగర్భ పంచాయితీ కంబాలబైలు గ్రామంలో నల్ల రాయి క్వారీని మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడి) ఆనంద్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించాఆరు. అనంతరం క్వారీ హద్దులను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమతులు ఇచ్చిన హద్దులు దాటవద్దని సూచించారు.

## తోలు బొమ్మలాట సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

**ప్రజాశక్తి-చింతపల్లి :** చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తోలుబొమ్మల ఆట శిక్షణ, తయారీపై సర్టిఫికెట్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన ప్రముఖ తోలుబొమ్మల ఆట కళాకారులు కే.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ప్రాచీన కళారూపమైన తోలుబొమ్మల ఆటను నేటి తరానికి పరిచయం చేసి, దాని వైభవాన్ని సంరక్షించాలని ఉన్నత ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. విద్యార్థుల్లో ప్రజా కళలపై ఆసక్తి పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఐ.రవీంద్ర నాయక్, జగత్‌రాయ్, ఈశ్వరరావు, పూర్ణారావు, శ్రీనివాసరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న రామాంజనేయులు

## స్త్రీ శక్తిలో విశాఖ ప్రథమ స్థానం

**రాష్ట్ర రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్**

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:** మహిళలకు ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకం అమలులో విశాఖపట్నం ప్రథమ స్థానంలో నిలిచిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ తెలిపారు. శనివారం విశాఖపట్నం కాంప్లెక్స్‌ను మంత్రి సందర్శించారు. ముందుగా మహిళా ప్రయాణికులను స్త్రీ శక్తి పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బస్సుల సమయ పాలన, సౌకర్యాల గురించి ప్రయాణికులను అడిగి కాంప్లెక్స్‌లో ఉన్న అద్దె షాపులను తనిఖీ చేశారు. ఎమ్మార్పి ధరలకు మాత్రమే వస్తువులను విక్రయించాలని ఆదేశించారు. డెంటల్ డాక్టర్ సంతోష్ రూ.3 లక్షల20 వేల విలువైన 1620 ప్రథమ చికిత్స కిట్‌లను అందించగా వాటిని విజయనగరం జోన్లో గల అన్ని బస్సులకు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. డాక్టర్ సంతోష్‌ను సత్కరించి అభినందించారు. అనంతరం ఆర్టిసి పూర్వపు విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 627 మంది అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వటానికి ప్రక్రియను వేగవంతం చేయాలని, జిల్లా ప్రజారవాణాఅధికారి అప్పలనాయుడును ఆదేశించారు. 37 మంది అసిస్టెంట్ డిపో క్లర్క్స్, కంట్రోలర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు పదోన్నతులకు సంబంధించి పత్రాలను మంత్రి అందజేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు టిహెచ్ఎస్ సౌకర్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. మహిళల ఉచిత ప్రయాణ చార్జీల నిమిత్తం 75 రోజులకు గాను రూ.400 కోట్లు ఆర్టిసికి తిరిగిచెల్లించేందుకు ఈ నెల 13న ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్ ఆర్టిసిజోన్-1, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.బ్రహ్మానందరెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.పద్మావతి పాల్గొన్నారు.

## కీలక మైలురాయిని చేరుకున్న ఎన్ఎస్ఐ

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్సి) భారతీయ ఆర్థిక వ్యవస్థలో మరో కీలకమైన మైలురాయిని చేరుకుందని ఎన్ఎస్ఐ చీఫ్ బిజినెస్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీరామ్‌కృష్ణన్ తెలిపారు. శనివారం ఆయన ఎయులో సిఐఐ బాగస్వామ్య వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నవంబర్ 2025 నాటికి, ఎన్ఎస్ఐలో ప్రత్యేకమైన ట్రేడింగ్ ఖాతాల సంఖ్య ఏకంగా 24 కోట్లు (240 మిలియన్లు) దాటిందని, గత ఏడాది అక్టోబర్‌లో 20 కోట్ల మార్కును దాటిన తర్వాత కేవలం ఒక సంవత్సరంలోనే ఈ అద్భుతమైన వద్ధి నమోదైందన్నారు. సెప్టెంబర్ 30, 2025 నాటికి, లిస్టెడ్ కంపెనీలలో వ్యక్తిగత పెట్టుబడిదారుల వాటా 18.75% కి చేరింది, ఇది గత 22 సంవత్సరాలలో గరిష్ట స్థాయి అని ఆయన అన్నారు.

## 13న జాతీయ లోక్ అదాలత్

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు**

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్:** డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. శనివారం విశాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న న్యాయమూర్తులతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యుడిషియల్ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేస్తూ, పెండింగ్‌లో ఉన్న కాంపౌండబుల్ కేసులు, నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ కేసులు, మోటార్ అక్సిడెంట్ క్లెయిమ్స్, ఫ్యామిలీకోర్టు విషయాలు, సివిల్, క్రిమినల్ కేసులను గుర్తించి, ఇరు పక్షాలకు నోటీసులు జారీ చేయాలన్నారు. గరిష్ట సెటిల్మెంట్లు సాధించాలని, ఈ లోక్‌అదాలత్ ద్వారా చిన్న చిన్న వివాదాలు, చెక్ బౌన్స్ కేసులు వంటి వాటిని వేగంగా పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలో న్యాయమూర్తులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, విశాఖపట్నం కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## విశాఖపట్నం పోర్టును సందర్శించిన విదేశీయులు

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:** నేపాల్, రష్యా నుంచి వచ్చిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం శనివారం విశాఖపోర్టును సందర్శించారు. నేపాల్ ప్రతినిధి బృందానికి నేపాల్ పరిశ్రమ, వాణిజ్య సరఫరాల మంత్రి, అనిల్ కుమార్ సిన్హా నాయకత్వం వహించారు. ఆయనతో పాటు బిపిన్ ఆచార్య, జాయింట్ సెక్రటరీ, పరిశ్రమ, వాణిజ్య సరఫరాల మంత్రిత్వశాఖ, తరకరాజ్ భట్ట, అండర్ సెక్రటరీ, పరిశ్రమ, వాణిజ్యం సరఫరాల మంత్రిత్వ శాఖ ఉన్నారు. రష్యా నుండి వచ్చిన 11 మంది సభ్యుల ప్రతినిధి బృందం పోర్టును సందర్శించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ అధికారులు ఇరువురికి స్వాగతం పలికారు. విశాఖపట్నం పోర్ట్ ద్వారా దిగుమతి ఎగుమతి కార్యకలాపాలను, వ్యాపార అభివృద్ధికి అందుబాటులో ఉన్న పెట్టుబడి అవకాశాలు, పరస్పర సహకార మార్గాలపై చర్చలు జరిపారు.

# బిర్సా ముండా త్యాగం వెలకట్టలేనిది

**వాడవాడలా జయంతి వేడుకలు**


హుకుంపేట: మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


రంపచోడవరం: నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ బొజ్జిరెడ్డి

**ప్రజాశక్తి-హుకుంపేట:** ఆదివాసీల కోసం తన జీవితాన్ని అర్పించిన మహా యోధుడు బిర్సా ముండా త్యాగం వెలకట్టలేనిదని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. మండలప్రజాపరిషత్ కార్యాలయం లో బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం ఆయన సేవలను స్మరించుకుంటూ నవంబర్ 15ను జనజాతి గౌరవ దివస్‌గా ప్రకటించిందని తెలిపారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సోమేలి చెల్లయ్య, కూడా ఈశ్వరరావు పాల్గొన్నారు.

**కాశీపట్నం:** గుమ్మకోట, వాలాసి పంచాయతీ గ్రామ సచివాలయ కార్యాలయాల్లో బిర్సాముండా జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అనంతగిరి వైసీపీ మండల అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ, సర్పంచ్ పాగి అప్పారావు పాల్గొన్నారు. వాలసి సచివాలయంలో టిడిపి అరుకు పార్లమెంట్ కార్యదర్శి నేగాలి సుందర్‌రావు మాట్లాడారు.

**పాడేరు టౌన్:** జన జాతీయ గౌరవ దివాస్ మహోత్సవాలు దేశం యావత్తు జరుపు కుంటుందని మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ రాహుల్ పురానా పేర్కొన్నారు. ఐటిడిఎలో బిర్సాముండా జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ఐటిడిఎ ఆవరణలో బిర్సా ముండా విగ్రహానికి ఐటిడిఎ పిఒ శ్రీపూజతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ఎన్నో పథకాలు తీసుకు వచ్చిందన్నారు. ఇన్చార్జి జెసి, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీ పూజ, రాష్ట్ర జానపద నృత్యం చైర్మన్ గంగులయ్య, గిరిజనుల మోర్చా భారతీయ రాష్ట్ర అధ్యక్షులు పాంగి రాజారావు, పాడేరు ఎంపిపి రత్నకుమారి, ఐటిడిఎ ఎఒ హేమలత పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ:** బిర్సా ముండా జయంతి వేడుకలను మండల కేంద్రంలో అల్లూరి యూత్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పుల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె సూర్యప్రకాశ్, ఎం.నవసూర్య, ఉదయ్ పాల్గొన్నారు.

గసబ పంచాయతీ జంగిడివలస గ్రామంలో రచ్చబండ వేధిక వద్ద పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత ఆధ్వర్యాన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. గసబ పంచాయతీ మాజీ సర్పంచ్ పాంగిపాల్గొన్నారు

**దేవీపట్నం:** దేవారం పంచాయితీ పరిధిలోని పోతవరంలోని పాత రైతు భరోసా కేంద్రంలో బిర్సా ముండా జయంతి నిర్వహించారు. శరభవరం,దేవారం ఎంపిటిసి సభ్యులు వైసిపి యూత్ కన్వీనర్ తుర్రం జగదీష్‌దొర, పంచాయతీ సెక్రటరీ మణికంత, ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్‌చైర్మన్ తెల్లంశేఖర్, భారత్ ఆదివాసీ పార్టీ దేవీపట్నం మండల అధ్యక్షులు చవలం విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**గంగవరం:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన బిర్సాముండా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి గంగాదేవి, మాజీ ఎంపిపి తీగల ప్రభ, మాజీ ఎంపిటిసి కోసు బుల్లియమ్మ తదితరులు పాల్గొన్నారు.

**రంపచోడవరం :** బిర్సా ముండా చిత్రపటానికి రాష్ట్ర ఎస్టీ కమిటీ చైర్మన్ యస్.బొజ్జిరెడ్డి, ఎస్టి కమిటీ డైరెక్టర్ గొర్లె దేబోరా సునీత, ఎంపిపి బంధం శ్రీదేవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శనివారం ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖాధికారులతో సమావేశమయ్యారు.రాష్ట్ర మైనార్టీ డైరెక్టర్ షేక్ సుభాని, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ఒడిశా సిఎం రాక**

**రాజవొమ్మంగి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన కమిషన్ (ఎస్సీ) చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డి శనివారం రాజవొమ్మంగిలోని ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 16న బిర్సా ముండా జయంతి వేడుకలకు ఒడిశా సిఎం చరణ్ మాఝి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఎస్సీ కమిషన్ సభ్యుల ప్రమాణ స్వీకారం 17వ తేదీన జరగనుందన్నారు. నియోజకవర్గంలో జీడి పిక్కల పరిశ్రమను స్థాపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**విఆర్‌పురం** : మండలంలో రేఖపల్లి కస్తూర్బా గాంధీ గురుకులంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బిర్సా ముండా చిత్రపటానికి గిరిజన సంఘం అధ్యక్షులు కారం సుందరయ్య, మండల కార్యదర్శి పూనం ప్రదీప్‌కుమార్, ఎంపిపి కారం లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. గిరిజన సంఘం నాయకులు కారం సత్తిబాబు, పూసం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

**సీలేరు:** జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ కార్యాలయంలో బిర్సాముండా జయంతి సందర్భంగా ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పాంగి దుర్గో నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి పరశురాం, ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

**చింతూరు:** బిర్సాముండా పోరాట స్ఫూర్తితో యువత హక్కు సాధనకై ముందుకు సాగాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీసం సురేష్ అన్నారు. శనివారం చింతూరులో బిర్సా ముండా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీసం సురేష్ మాట్లాడుతూ బ్రిటిష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకం గా ఆదివాసులను ఐక్యం చేసి బిర్సాముండా పోరాటం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పోడియం లక్ష్మణ్ కారం నాగేష్ , కూర లక్ష్మణ్‌రావు, మాడివి భాస్కర్ రావు, సుబ్బారావు మనోజ్ పాల్గొన్నారు.


పాడేరు: ఐటిడిఎ ఆవరణలో...


చింతూరు: నివాళులర్పిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు


విఆర్‌పురం: నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం అధ్యక్షుడు కారం సుందరయ్య

# ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులు

**రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమిదే..**
**మంత్రులు, అధికారుల సమిష్టి కృషితో సమ్మిట్ సూపర్‌హిట్**
**భాగస్వామ్య సదస్సు ముగింపులో సిఎం చంద్రబాబు**

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

వచ్చే ఐదేళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సిఐఐ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా విశాఖలో రెండు రోజులపాటు నిర్వహించిన భాగస్వామ్య సదస్సు సూపర్‌హిట్ అయిందని పేర్కొన్నారు. జయప్రదం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్పూర్తిగా అభినందిస్తున్నానన్నారు. శనివారం ఎయు గ్రౌండ్‌లో తలపెట్టిన సమ్మిట్ ముగింపు వేడుకలో ఆయన మాట్లాడారు. 45 దేశాల్లో సమ్మిట్ చర్చనీయాం శమైందని, విశాఖ పేరు మార్మోగుతోందని తెలిపారు. మంత్రులు, అధికారుల కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. సదస్సులో అర్థవంతమైన, విజ్ఞానవంతమైన చర్చలు జరిపామన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా సిఐఐ సదస్సు జయప్రదానికి కృషి చేసిన అధికారులను మెచ్చుకున్నారు. ప్రశంసాపత్రాలు అందించారు.

**ప్రత్యేక ఆకర్షణగా ఓపెన్ ఎగ్జిబిషన్**

**ఎంవిపి.కాలనీ :** ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో రెండు రోజులపాటు నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు హాల్ 2లో ఏర్పాటు చేసిన ఓపెన్ ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న అనుకూలతలు, ప్రభుత్వ విధానాలపై వివరించారు. గ్రీన్ ఎనర్జీ (పునరుత్పాదక ఇంధనం), ఐటి (సమాచార సాంకేతికత), ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహార శుద్ధి), ఆటోమొబైల్స్, అంతరిక్ష - రక్షణ, టూరిజం వంటి కీలక రంగాలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు.

**గోద్రెజ్ అగ్రోవెట్ రూ.70 కోట్ల పెట్టుబడి**

**ఎంవిపి.కాలనీ :** దేశంలోని అతిపెద్ద డైవర్సిఫైడ్ అగ్రి ఫుడ్ వ్యాపార సంస్థలలో ఒకటైన గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కీలకమైన ఎంఒయుపై సంతకం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జరిగిన ఈ ఒప్పందం ద్వారా ఆ కంపెనీ రాష్ట్రంలో రూ.70 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందం ద్వారా డెయిరీ వ్యాపారం విస్తరణ సాగనుంది. గోద్రెజ్ అగ్రోవెట్ తన డెయిరీ ప్రాసెసింగ్ సామర్థ్యాలను గణనీయంగా విస్తరించనుంది.